www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 1 ఏప్రిల్ 2023
5
పశ్చిమ గోదావరి



ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి
ఆర్‌డిఒ దాసి రాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు పొందిన ప్రతి లబ్ధిదారుడు ఇంటి నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒ దాసి రాజు అధికారులను ఆదేశించారు. పాలకోడేరులో జగనన్న లేఅవుట్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ లేఅవుట్‌కు వెళ్లే దారి ఇబ్బందికరంగా ఉండటంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించడం లేదని తెలుసుకున్న ఆర్‌డిఒ స్థానిక అధికారులతో మాట్లాడారు. గ్రామ పంచాయతీ నిధులు రూ.8 లక్షలతో రహదారి నిర్మాణం చేసేలా చర్యలు తీసుకున్నారు. ఆయన వెంట గృహనిర్మాణ శాఖ డిఇ బి.వి.రమణ, తహశీల్దార్ షేక్ హుస్సేన్, ఎంపిడిఒ ఎస్.మురళీ గంగాధరరావు, ఎఇ నరసింహారావు, ఆర్‌ఎస్‌ఐ నాగభూషణం ఉన్నారు.

లంకపేట రోదన..!

గరగపర్రు రోడ్డులో నిర్దాక్షిణ్యంగా ఇళ్లు, షాపుల తొలగింపు

రోడ్డున పడ్డ 150 నిరుపేద కుటుంబాలు

బాధితులకు అండగా నిలిచిన సిపిఎం

ప్రజాశక్తి - భీమవరం

వారంతా రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలు.. ఇంటిల్లిపాది కాయకష్టం చేస్తే గాని జీవనం సాగని పరిస్థితి. అటువంటి వారిపై ప్రభుత్వం, అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. 70 ఏళ్ల నుంచి అక్కడే నివాసముంటున్న ఇళ్లను, షాపులను పోలీసుల పహారాతో, పొక్లెయిన్లతో నేలమట్టం చేశారు. ప్రభుత్వ దుశ్చర్యతో 50 ఇళ్లకు చెందిన 150 కుటుంబాల పేదలు రోడ్డున పడ్డారు. ఈ నేపథ్యంలో సిపిఎం బాధితులకు అండగా నిలబడింది.



ఇళ్లను పడగొడుతున్న పొక్లెయిన్లు

భీమవరం పట్టణాన్ని ఆనుకుని లంకపేట ఉంది. ఈ ప్రాంతం గరగపర్రు రోడ్డుకు ఆనుకుని ఉంటుంది. ఇక్కడ 150 కుటుంబాల వారు నివాసం ఉంటున్నారు. ఒక ఇంట్లో రెండు మూడు కుటుంబాల చొప్పున జీవనం సాగిస్తున్నారు. లంకపేటలో నివాసం ఉంటున్న వారంతా నిరుపేద దళితులే. నిత్యం ఏదో ఒక పని చేసుకుంటే తప్ప పూట గడవని పరిస్థితి. తెల్లవారుతు దాంట్లో తినేటోనికో రూపాయి రూపాయి కూడగట్టుకుని గూడు ఏర్పాటు చేసుకున్నారు. మరి కొంతమంది షాపులు ఏర్పాటు చేసుకుని ఆదాయం పొందుతున్నారు. అయితే పట్టణ సుందరీకరణ, విస్తరణ పేరుతో ప్రభుత్వం, అధికారులు వారి బతుకులను చిందరవందర చేశారు. పట్టణ సుందరీకరణలో భాగంగా రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్నాయన్న నెపంతో ఇళ్లను, షాపులను నిర్దాక్షిణ్యంగా నేలమట్టం చేశారు. అధికారుల చర్యతో పేదలు కట్టుబట్టలతో మిగిలారు.

హైకోర్టు స్టే ఉన్న కూల్చివేత

స్థానికంగా నివాసం ఉంటున్నవారు కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఇళ్లను తొలగించొద్దంటూ హైకోర్టు స్టే ఆర్డర్ ఇచ్చింది. అయితే ఇవేమీ పట్టించుకోకుండా రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం హైకోర్టు ఆదేశాలను బేఖాతర్ చేసింది. కోర్టు ఆదేశాలను చూపుతున్నప్పటికీ నిర్దాక్షిణ్యంగా ఇళ్లు తొలగించారని ఆ ప్రాంతవాసులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే 1996లో అప్పటి నరసాపురం సబ్ కలెక్టర్ కృష్ణబాబు వారందరికీ పట్టాలిచ్చారు. అయితే సుందరీకరణ, రోడ్డు విస్తరణకు అడ్డులేని ఇళ్లను కూడా అధికారులు అత్యుత్సాహంతో తొలగించారని స్థానికులు విమర్శిస్తున్నారు.

కొన్నాళ్ల క్రితం ఈ ప్రాంతాన్ని అనుకుని ఉన్న కొన్ని ఇళ్లను తొలగించారు. అప్పట్లో కొంతమందికి టిడ్కో గృహాలను కేటాయించారు. అయితే టిడ్కో ఇళ్ల సముదాయం వద్ద కనీస సౌకర్యాలు లేకపోవడంతో అక్కడ నివాసం ఉండేందుకు ఎవరూ ఆసక్తి చూపలేదు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం లంకపేటలో ఇళ్లు ఖాళీ చేస్తున్న లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు కేటాయించామని అధికారులు చెబుతున్నారన్నారు. వాస్తవానికి గతంలో కేటాయించిన టిడ్కో ఇళ్లను ప్రస్తుతం వీరికి కేటాయించే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే టిడ్కో ఇళ్ల వాస్తవ లబ్ధిదారులు రాకపోవడం వల్ల ఆ ఇళ్లను వీరికి కేటాయిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న వాస్తవ లబ్ధిదారులు గృహాల వద్దకు రావడంతో ఇరువురి మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు సమస్యను సృష్టించేవిధంగా వ్యవహరిస్తున్నారని పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పట్టా ఉన్న ఇల్లు కేటాయింపు లేదు

ఇల్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ ఇల్లు కేటాయిస్తున్నామని అధికారులు గతంలో ప్రభుత్వం ద్వారా పట్టాలు పొందిన వారికి ఇళ్లను కేటాయించకపోవడం గమనార్హం. ఏ ప్రాతిపదికన ఇళ్ల కేటాయింపు జరిగిందో అర్థం కాని పరిస్థితి. ప్రభుత్వం ఇచ్చిన పట్టాను కూడా పరిగణలోకి తీసుకోకుండా ఇల్లు కేటాయింపులు జరిగిపోయాయి. ఈ నేపథ్యంలో అధికారులు చేసిన సర్వే అస్తవ్యస్తంగా ఉందని విమర్శలు వెలువెత్తుతున్నాయి.

బాధితులకు అండగా సిపిఎం

లంకపేట బాధితులకు సిపిఎం అండగా నిలిచింది. ఇళ్లు కూల్చుతున్నారన్న విషయం తెలుసుకున్న సిపిఎం బృందం ఆ ప్రాంతంలో పర్యటించింది. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతానికి చెందిన అనేకమంది సమస్యను బృందం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో బాధితులకు సిపిఎం భరోసా కల్పించింది. సమస్య పరిష్కారం అయ్యేంతవరకూ అండగా ఉంటామని హామీ ఇచ్చింది. బాధితులను కూడగట్టి సిపిఎం ఆధ్వర్యంలో భీమవరం మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించింది. ఇల్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికీ ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని, లేదా టిడ్కో గృహాలు కేటాయించాలని డిమాండ్ చేసింది. సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించింది.

అర్హులందరికీ ఇళ్లు కేటాయించాలి..



బి.బలరాం, సిపిఎం జిల్లా కార్యదర్శి, భీమవరం

లంకపేటలో ప్రభుత్వం, అధికారులు, పోలీస్ యంత్రాంగం అత్యుత్సాహం ప్రదర్శించి ఇళ్లు, షాపులను నేలమట్టం చేయడం దుర్మార్గం. హైకోర్టు స్టే ఉన్నప్పటికీ, గతంలో ఇళ్ల పట్టాలు ఇచ్చినప్పటికీ అవేమీ పట్టించుకోకుండా ఇళ్లను తొలగించడం హేయమైన చర్య. నిర్దాక్షణంగా తొలగించిన ప్రతి ఇంటికీ నష్టపరిహారం అందించాలి. ప్రభుత్వాధికారుల సర్వేలో పట్టాలు ఉన్న వారి పేర్లు జాబితాలో లేకపోవడం దారుణం. ఏ ప్రాతిపదికన సర్వే చేసి జాబితాను రూపొందించారో అధికారులు చెప్పాలి. అధికారులు చేపట్టిన సర్వేతో సంబంధం లేకుండా అర్హులందరికీ ఇళ్లు కేటాయించాలి. లేనిపక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తాం.

సమస్య పరిష్కారానికి చర్యలు..

దాసి రాజు, ఆర్‌డిఒ, భీమవరం



లంకపేట సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. జిల్లా కలెక్టర్ ప్రశాంతి దృష్టికి తీసుకెళ్లి మున్సిపల్ అధికారులతో మాట్లాడి చర్యలు చేపడతాం. ఎటువంటి అపోహలూ పెట్టుకోవద్దు. అర్హులందరికీ ఇళ్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటాం.



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

పది పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల మూడో తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు పరీక్షా కేంద్రాల్లోని ప్రతి గదినీ తనిఖీ చేయాలన్నారు. లైటింగ్, ఫ్యాన్లు, బెంచీలు, బ్లాక్‌బోర్డులు, తాగునీరు, మరుగుదొడ్ల ఏర్పాట్లను పరిశీలించాలన్నారు. తనిఖీలకు మహిళా పోలీసులను ఏర్పాటు చేయడంతో పాటు ప్రైవసీ ఏర్పాట్లను కచ్చితంగా పాటించాలన్నారు. నిర్దేశిత ప్రదేశాల్లో 144వ సెక్షన్ నూరు శాతం అమలయ్యేలా తహశీల్దార్లు పర్యవేక్షించాలన్నారు. పరీక్షా కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 50 'సి' క్లాస్ పరీక్ష కేంద్రాలను గుర్తించామని తెలిపారు. వాటిని ప్రతిరోజూ తహశీల్దార్, ఎంపిడిఒ, మున్సిపల్ కమిషనర్లు తనిఖీ చేయాలని ఆదేశించారు. ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఎస్-ఎస్‌సి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు 14 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వాటిలో 5 ఎస్ఎస్‌సి పరీక్షలకు, 9 ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు కేటాయించడం జరిగిందన్నారు. జిల్లాలో 24,586 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షా పత్రాలు భద్రపర్చేందుకు 22 పోలీస్ స్టేషన్లలో స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 121 మంది చొప్పున చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు, 12 మంది అదనపు డిపార్ట్మెంటల్ అధికారులు, 44 మంది కస్టోడియన్లు, 6 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 50 సిట్టింగ్ స్క్వాడ్లు, 44 మంది రూట్ అధికారులు, 1,190 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణలో తప్పిదాలకు శాఖాపరమైన చర్యలతో పాటు, క్రిమినల్ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, డిఇఒ ఆర్.వెంకటరమణ, సమగ్ర శిక్ష ఎపిసి పి.శ్యాంసుందర్, జిల్లా జిఎస్‌డబ్ల్యుఎస్ అధికారి కెసిహెచ్ అప్పారావు, డిఎంహెచ్ఒ డి.మహేశ్వరరావు పాల్గొన్నారు.

పది పరీక్షలపై కంట్రోల్ రూమ్


ప్రజాశక్తి - భీమవరం

త్వరలో ప్రారంభమయ్యే ఎస్ఎస్‌సి, ఒఎస్ఎస్‌సి, ఒకేషనల్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన సలహాలు, సూచనలు, ఫిర్యాదులు అందజేసేందుకు జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు డిఇఒ ఆర్‌వి.రమణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కంట్రోల్ రూమ్ కార్యాలయ పని వేళల్లో పని చేస్తుందన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు గమనించాలని కోరారు.

ముత్యాలమ్మ సన్నిధిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లి గ్రామంలోని బండి ముత్యాలమ్మవారిని శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట్రామన్ రామ సుబ్రహ్మణ్యన్ సత్యవతి దంపతులు దర్శించు కున్నారు. ఆలయ అర్చకులు తుమ్మపూడి ఫణి, అచ్యుత్ వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, ఛైర్మన్ కొల్లాటి రామారావు, పాలకవర్గ సభ్యులు, శేష వస్త్రం, ప్రసాదం, జ్ఞాపికను అందజేశారు. వారి వెంట న్యాయవాదులు దాసరి ప్రసాద్, సిహెచ్ వెంకట్రామన్, గుడిసేవ నరసింహారావు, స్వర్ణ ప్రభాకర్ ఉన్నారు.




ముత్యాలమ్మను దర్శించుకుంటున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి

ఇళ్ల బాధితుల అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా

ఆర్‌డిఒ దాసి రాజు హామీ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

గరగపర్రు రోడ్డు విస్తరణ పనుల్లో తొలగించిన ఇళ్ల బాధితులకు న్యాయం జరిగేలా, అర్హులైన ప్రతి ఒక్కరికి టిడ్కో ఇల్లు మంజూరయ్యేలా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తానని ఆర్‌డిఒ దాసి రాజు హామీ ఇచ్చారు. బాధిత పేదలు సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించాక ఆర్‌డిఒ కార్యాలయానికి చేరుకుని ఆర్‌డిఒకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ దాసి రాజు మాట్లాడుతూ ఇల్లు కోల్పోయిన బాధితులు ఆందోళన చెందవద్దని, గతంలో నిర్వహిస్తున్న డోర్ నెంబర్ ఆధారంగా పేర్లు నమోదు చేసినట్లు తెలిపారు. దీనిపై బాధితులు మాట్లాడుతూ ఒకే డోర్ నెంబర్ ఇంటిలో తల్లిదండ్రులతో పాటు, పెళ్లయి పిల్లలున్న ఇద్దరేసి కొడుకులు ఉన్నారని, వారికి ప్రత్యేకంగా రేషన్ కార్డులు ఉన్నాయని వారికి కూడా ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.వాసుదేవరావు, వైకుంఠరావు, బైదులు పాల్గొన్నారు.



ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు, సిపిఎం నేతలు

ఉద్యోగుల పట్ల చిన్నచూపు తగదు

భీమవరం కలెక్టర్ ఉద్యోగులు ఆవేదన

ప్రజాశక్తి - భీమవరం

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగులు శాంతియుతంగా నిరసన తెలియజేస్తుంటే ప్రభుత్వం చిన్న చూపు చూడడం తగదని భీమవరం కలెక్టరేట్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఉద్యోగులు చేపట్టిన నిరసన 23వ రోజుకు చేరింది. వర్క్ టు రూల్‌లో భాగంగా సాయంత్రం కార్యాలయానికి తాళాలు వేసి ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాలన్నీ ఒక్కటై ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. ఎన్నో రోజుల నుంచి నిరసన తెలియజేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. మిగిలిన రాష్ట్రాల్లో సిపిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్‌కు వెళ్తుంటే రాష్ట్రంలో అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి ఎస్.సుబ్రహ్మణ్యం, సిహెచ్.రవికుమార్, నిజాముద్దీన్ షా, సీనియర్ సహాయకులు వివి.పెద్దిరాజు, పి.జగన్మోహన్, కె.కళ్యాణి, పి.గౌతమి పాల్గొన్నారు.



కార్యాలయానికి తాళాలు వేసి నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

గృహ నిర్మాణాల ప్రగతికి కృషి చేయాలి

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం

అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గృహ నిర్మాణాల ప్రగతికి కృషి చేయాలని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి.ప్రసాదరాజు అన్నారు. శుక్రవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు గృహ నిర్మాణాల ప్రగతిపై గృహ నిర్మాణ శాఖ, ఎంపిడిఒలు, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులతో సబ్ కలెక్టరు ఎం.సూర్య తేజతో కలిసి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలం మూడు నెలలు వాతావరణం అనుకూలంగా ఉంటుందన్నారు. లేఅవుట్లలో మట్టి పూడ్చించి గృహ నిర్మాణాలకు అనువుగా అప్రోచ్ రహదారులను సిద్ధం చేయాలన్నారు. లేఅవుట్లలో విద్యుత్, డ్రెయినేజీ, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. అప్పుడే లబ్ధిదారులు ముందుకొచ్చి నిర్మాణాలను ప్రారంభిస్తారన్నారు. లేఔట్లలో వెంటనే లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలు ప్రారంభించాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో గృహ నిర్మాణాల ప్రగతిని పర్యవేక్షించాలన్నారు. ప్రతివారమూ గృహ నిర్మాణ ప్రగతిపై సమావేశం జరుగుతుందని, ప్రతి సమావేశంలో మెరుగైన ఫలితాలు కనిపించాలని ఆయన ఆదేశించారు. సబ్ కలెక్టరు ఎం.సూర్యతేజ మాట్లాడుతూ నియోజవర్గంలో సుమారు పదివేల ఇళ్ల నిర్మాణాలకు మంజూరు చేయగా, 2200 ఇళ్ల నిర్మాణాలలో ఉన్నాయని, 6500 బేస్మెంట్ దశలో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ బర్రి శ్రీ వెంకట రమణ, ఎంపిపి మైలాబత్తుల సోనీ, జెడ్‌పిటిసి సభ్యులు బొక్కా రాధాకృష్ణ, తిరుమాని బాపూజీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు

లింగ నిర్ధారణ పరీక్షలను ఉపేక్షించేది లేదు : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

గర్భస్థ శిశులింగ నిర్ధారణ పరీక్షలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో పిసిపిఎన్‌డిటి చట్టం అమలుపై జిల్లాస్థాయి మల్టీ మెంబర్స్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లపై తరచూ ఆకస్మిక తనిఖీలు చేపట్టాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలను నిరోధించేందుకు డెకాయ్ ఆపరేషన్‌కు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 131 స్కానింగ్ సెంటర్స్ రిజిష్టర్వ్వగా ప్రస్తుతం 121 పని చేస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా క్షయ వ్యాధి నియంత్రణ చర్యల పరిశీలనలో భాగంగా జాతీయస్థాయిలో 39 సంస్థలకు మెడల్స్‌ను అందజేశారని, దీనిలో జిల్లా బ్రాంజ్ మెడల్‌ను అందుకోవడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ బాలునాయక్ కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా క్షయ వ్యాధి నియంత్రణాధికారి డాక్టర్ బాలునాయక్‌ను కలెక్టర్ అభినందించారు. సమావేశంలో ఎఎస్‌పి సుబ్బరాజు, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ వి.ప్రసాద్, డిఐఒ దేవ సుధ, జిల్లా పిఎం ఆఫీసర్ సుగుణరాజు, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు శివరామ బద్రిరాజు పాల్గొన్నారు.

అమూల్ విస్తరణకు కృషి చేయాలి

జిల్లాలో అమూల్ విస్తరణకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో అమూల్ విస్తరణపై సంబంధిత అధికారులతో ఆమె సమీక్షించారు. అమూల్ విస్తరణకు మొగల్తూరు గ్రామంలో పాడి రైతులను గుర్తించాలన్నారు. లక్ష్యాలకు మించి అమూల్ పాలసేకరణకు అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. నరసాపురంలో ఐదు వేల లీటర్ల పాల సేకరణ లక్ష్యం కాగా పాల సేకరణ చాలా తక్కువగా ఉందని, ఈ విషయమై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్-ఎస్.వేణుగోపాల్, జిల్లా పశుసంవర్థక శాఖాధికారి మురళీకృష్ణ, డిసిఒ రవికుమార్, అమూల్ సిబ్బంది పాల్గొన్నారు.

రూరల్‌బ్యాంక్ అభివృద్ధికి సహకరించాలి

ఛైర్మన్ పేరిచర్ల సూర్యనారాయణరాజు

ప్రజాశక్తి - ఉండి

రూరల్ బ్యాంకులో తీసుకున్న రుణాలను ప్రతిఒక్కరూ సకాలంలో చెల్లించి బ్యాంక్ అభివృద్ధికి సహకరించాలని ఉండి విశాల సహకార పరపతి సంఘం ఛైర్మన్ పేరిచర్ల సూర్యనారాయణరాజు అన్నారు. ఉండిలో శుక్రవారం ఛైర్మన్ పేరిచర్ల సూర్యనారాయణ రాజు అధ్యక్షతన నిర్వహించిన మహాజన సభలో బ్యాంక్ కార్యదర్శి గంగమోలు ప్రసాద్ గత ఆరు నెలలకు సంబంధించి లావాదేవీలు, వ్యాపార ఖాతాను సభ్యులకు చదివి వినిపించారు. అనంతరం సూర్యనారాయణరాజు మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి సహకార సంఘాలు కట్టుబడి ఉన్నాయని, ప్రతిఒక్కరూ తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సహకార సంఘాల అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఉండి విశాల సహకార పరపతి సహకార సంఘంలో రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగుమందులు సబ్సిడీలో అందుబాటులో ఉన్నాయని కావాల్సిన వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సహకార సంఘంలో డిపాజిట్ల సేకరణకు త్రిసభ్య కమిటీ కృషి చేస్తుందని, జిల్లాలో ఉండి సహకార సంఘాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు త్రిసభ్య కమిటీ కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం సభ్యులు కార్యదర్శి ప్రవేశపెట్టిన తీర్మానాలను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో త్రిసభ్య కమిటీ సభ్యులు కరిమెరక శివ నాగరాజు, చిట్టూరి రత్నరాజు, సహకార సంఘం సభ్యులు కరిమెరక రామచంద్రరావు, గలావిల్లి ధనుంజయ, లంకా ప్రకాష్, ఇల్లాపు అప్పాజీ, మెట్ట అప్పారావు, మెట్ట సత్యనారాయణ, నిమ్మల కేశవ్ కుమార్, మద్దిల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరం మండలంలోని అండలూరు, పెరికిపాలెం, మత్స్యపురి, చింతలకోటి గరువు, వీరవాసరం గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎంఎల్‌ఎ ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. నియోజకవర్గంలో సుమారుగా 15 వేల మందికి పైగా ఇళ్ల స్థలాలను పంపిణీ చేసి పట్టాలు కూడా అందించామన్నారు. లబ్ధిదారులు గృహ నిర్మాణాలు కూడా ప్రారంభించారని తెలిపారు. తాజాగా ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు వేగవంతంగా గృహ నిర్మాణాలు ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.సుందర్రాజు, వీరవాసరం సర్పంచి చికిలే మంగతాయారు, అండలూరు ఎంపిటిసి బొల్లంపల్లి శ్రీనివాస చౌదరి, నల్లం రాంబాబు పాల్గొన్నారు.

సర్దుబాటు ఉపాధ్యాయులను తిరిగి పంపాలి

యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి - భీమవరం

పని సర్దుబాటులో ఉపాధ్యాయులను వంద కిలోమీటర్లకుపైగా దూరంలో ఉన్న వేరే జిల్లాలకు సర్దుబాటు చేసిన వారిని తిరిగి వారి ప్రాంతాలకు పంపించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం అన్నారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం యుటిఎఫ్ నాయకులు డిఇఒకు వినతిపత్రం అందజేశారు. ఎస్ఎస్‌సి స్పాట్ వాల్యూయేషన్‌లో మెడికల్ గ్రౌండ్స్‌లో ఉన్న వారిని, 58 సంవత్సరాలకు పైబడిన వారిని మినహాయింపు ఇవ్వాలన్నారు. దీనిపై తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నేతలు పట్టాభిరామయ్య, సాయిరాం, రామకృష్ణంరాజు, రామకృష్ణప్రసాద్, ఏసుబాబు, కుమార్, బాబ్జి పాల్గొన్నారు.



డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

చెరుకువాడ విఆర్‌ఒను విధుల నుంచి తొలగించాలి

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఉండి

కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని అర్జీ పెట్టుకున్న దళిత మహిళకు సర్టిఫికెట్ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్న చెరుకువాడ గ్రామ రెవెన్యూ అధికారి చిన్నారావును వెంటనే విధుల నుండి తొలగించాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మత్తే రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ స్వామినాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మత్తే రాజ్‌కుమార్ మాట్లాడుతూ వాంద్రం గ్రామానికి చెందిన హేమకుమార్ 12 సంవత్సరాల నుంచి చెరుకువాడలో పాస్టర్‌గా చేస్తున్నారని, అతని భార్య సుమలత కుల ధ్రువీకరణ పత్రం కోసం విఆర్‌ఒకు అర్జీ పెట్టిందని తెలిపారు. అయితే నీ భర్త పాస్టర్‌గా పనిచేస్తున్నారని, నీవు చర్చికి వెళ్తున్నావని కాబట్టి ఎస్‌సి సర్టిఫికెట్ ఇవ్వడం కుదరదని, బిసి సి సర్టిఫికెట్ ఇస్తానని విఆర్‌ఒ అంటున్నాడని తెలిపారు. దీనిపై సుమలత మాట్లాడుతూ తన చిన్నతనం నుండి ఎస్‌సి సర్టిఫికెట్ ఉందని, వారం రోజుల నుండి విఆర్‌ఒ చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని వాపోతోంది. ఇటీవల కాలంలో తన కుటుంబంపై గ్రామస్తుల దాడులు పెరిగిపోయాయని, తన కులానికి సంబంధించి సర్టిఫికెట్ పోలీసులకు అందించాల్సిన అవసరం ఉండబట్టే విఆర్‌ఒను అడిగానని తెలిపారు. తనకు ఎస్‌సి సర్టిఫికెట్ ఇచ్చి న్యాయం చేయాలని ఆమె కోరింది. కార్యక్రమంలో ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు ఏసేబు, దానియేలు, మార్టిన్ లూథర్, సుందర్రావు, జోసెఫ్, యాకోబు, యేసయ్య పాల్గొన్నారు.

ఆన్‌లైన్ కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలి : ఎస్‌ఐ

ప్రజాశక్తి - పాలకోడేరు

ఇటీవల ఆన్‌లైన్ కొనుగోలుల్లో అనేక మోసాలు జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలని ఎస్‌ఐ ఎస్.శ్రీనివాసరావు సూచించారు. పాలకోడేరు సచివాలయం వద్ద గ్రామ సర్పంచ్ ఇంజెట్టి మరియమ్మ అధ్యక్షతన శుక్రవారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తహశీల్దార్ షేక్ హుస్సేన్, మండల పరిషత్ అధ్యక్షులు మురళీ గంగాధర్ మాట్లాడుతూ ప్రతి ఒకరూ నేర నియంత్రణలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు నాగలక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ శివకృష్ణ, ఇఒపిఆర్‌డి రెడ్డియ పాల్గొన్నారు.

వాలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - పాలకోడేరు

మండలంలో ఖాళీగా ఉన్న ఏడు వాలంటీర్ పోస్టులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. గొల్లలకోడేరు, కుముదవల్లి, పాలకోడేరు, పెన్నాడ అగ్రహారం, శృంగవృక్షంలో ఏడు వాలంటీర్ పోస్టులు ఖాళీగా ఉండడంతో వాటికి ఇటీవల 14 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇఒపిఆర్‌డి రెడ్డియ, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. పారదర్శకంగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

మావుళ్లమ్మకు 10 గ్రాముల బంగారం విరాళం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం మావుళ్లమ్మకు కాళ్ల మండలం జువ్వలపాలెనికి చెందిన కలిదిండి రాజ్యలక్ష్మి 8 గ్రాముల బంగారం, ఆమె తండ్రి జంపన కృష్ణమూర్తి రాజు రెండు గ్రాముల బంగారం అమ్మవారి స్వర్ణాభరణం నిమిత్తం సమర్పించారు. వారికి ఆలయ ధర్మకర్తలు ముత్యాల వెంకట రామారావు, రామయణం సత్యనారాయణ, సిబ్బంది ఆలయ మర్యాదలతో సత్కరించారు.

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పౌష్టికాహారం తీసుకుంటే గర్భిణులు ఆరోగ్యకరమైన శిశువులకు జన్మనిస్తారని, అలగే బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ పీడీ బి.సుజాతారాణి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఐసిడిఎస్ భీమవరం ప్రాజెక్టు సిడిపిఒ టివి లక్ష్మీకాంతం అధ్యక్షతన భీమవరం నియోజకవర్గ పోషణ్ పక్వాడా కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పిడి సుజాత రాణి హాజరై మాట్లాడారు. వైసిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, సోమేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ కోడే విజయలక్ష్మి, సిడిపిఒ లక్ష్మీకాంతం మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ ఏర్పాటుచేసిన చిరుధాన్యాలతో చేసిన వంటకాలు ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు.

పూడికపనులు వేగవంతం చేయాలి : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

నియోజకవర్గ పరిధిలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించిన లేఅవుట్లలో కొన్ని చోట్ల పూడిక పనులు జరిగాయని, మరికొన్ని చోట్ల పనులు జరగలేదని, వెంటనే అధికారులు పూడిక పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులను ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ ఆదేశించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శుక్రవారం హౌసింగ్ అధికారులతో ఆయన సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వేసవికాలం దృష్ట్యా పూడిక పనులు జరగడానికి వాతావరణం అనుకూలంగా ఉంటుందని, వెంటనే పనులు వేగవంతం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలోని విస్సాకోడేరు లేఅవుట్‌లో ప్రస్తుతం 2 వేల మంది వరకూ లబ్ధిదారులు గృహ నిర్మాణాలు జరుపుకుంటున్న నేపథ్యంలో మిగిలిన వారు కూడా త్వరితగతిన నిర్మాణాలు ప్రారంభించేలా వారికి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి పీడీ జి.పిచ్చయ్య, వీరవాసరం తహశీల్దార్ ఎం.సుందర్‌రాజు, ఇఇ వెంకటరమణ పాల్గొన్నారు.

గూడెంలో ఫ్రైడే డ్రైడే

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పట్టణంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వైఎస్‌ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం కడకట్ల పరిధిలోని 34, 35వ వార్డు సచివాలయాల్లో నిర్వహించిన కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న 50వ విడత ఫీవర్ సర్వే, వెక్టార్ కంట్రోల్ హైజీన్‌పై క్షేత్రస్థాయిలో అమలుపై పలు సూచనలు చేశారు. ప్రజారోగ్య పరిరక్షణలో ప్రజలు భాగస్వామ్యులు కావాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు.

పాలకోడేరు : ప్రస్తుతం కలుషితమైన తాగునీరు తాగడం ద్వారా అనేక రోగాలకు గురవుతున్నామని, ఆ రోగాలను అధికమించాలంటే క్లోరినేషన్ చేసిన నీటిని తాగడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని హెల్త్ సూపర్‌వైజర్ శంకర్ అన్నారు. డ్రై డే కార్యక్రమంలో భాగంగా పాలకోడేరు పిహెచ్‌సి వైద్యులు రంగంనాయుడు సూచనలతో గొరగనమూడి గ్రామంలో వాటర్ ఫిల్టర్లను శుభ్రం చేసే కార్యక్రమాన్ని పంచాయతీ సిబ్బందితో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బందికి ఫ్లోరినేషన్ ఏ విధంగా ఉండాలో వైద్య సిబ్బంది సూచనలు అందించారు.

సెల్ టవర్ ఎక్కి యువకుడు హల్‌చల్

ప్రజాశక్తి - ఉండి

పోలీస్‌స్టేషన్‌లో తనకు న్యాయం జరగలేదని ఒక యువకుడు సెల్ టవర్ ఎక్కిన సంఘటన ఉండిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాగాయలంక నుంచి నరసాపురం వైపు వెళ్తున్న అవనిగడ్డ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు ఉండి మెయిన్ సెంటర్‌లో ఆగి ఉన్న ఆటోను రాసుకుంటూ వెళ్లింది. దీంతో ఆటోడ్రైవర్ బస్సు డ్రైవర్‌తో ఘర్షణకు దిగగా పోలీస్‌స్టేషన్ ఎఎస్‌ఐ అడబాల శ్రీనివాసరావు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేయాలని కానిస్టేబుల్స్‌కు చెప్పారు. పోలీస్‌స్టేషన్‌లో తనకు న్యాయం జరగలేదని ఆటోడ్రైవర్ దువ్వి సూరిబాబు తహశీల్దార్ కార్యాలయంలో ఉన్న సెల్ టవర్ ఎక్కి దూకేస్తానంటూ హల్‌చల్ చేశాడు. దీంతో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వి.ఆంజనేయులు వచ్చి న్యాయం జరిగేలా చూస్తానని ఆటో డ్రైవర్‌కు హామీ ఇవ్వడంతో కిందకు దిగాడు. దీంతో బంధువులు, స్థానికులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

విఆర్‌ఒ, విఎఎలకు అవగాహన

ప్రజాశక్తి - పెనుమంట్ర

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దాళ్వా పంట కొనుగోలుపై ముందుగా చేసుకోవాల్సిన ప్రణాళికపై విఆర్‌ఒ, విఎఎలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి కర్రి వెంకటనారాయణరెడ్డి (వాసురెడ్డి) మాట్లాడుఊత ఈ పంటకు ముందస్తు ప్రణాళికతో ధాన్యం కొనుగోలు సమన్వయంతో చేయాలన్నారు. జుత్తిగ సొసైటీ కార్యదర్శి రమణకుమార్ మాట్లాడుతూ రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ఎగుమతి చేసేందుకు అదనపు ఖర్చు అవుతోందని ఎంపిపి దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ దండు అశోక్‌వర్మ, ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జి, ఆర్ఐ సుబ్బారావు, సిఎస్‌ఆర్ఐ పోతురాజు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

విద్యార్థి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్/ఉండి

భీమవరం పట్టణానికి చెందిన ముమ్మన అభిరామ్(16) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అభిరామ్ మృతదేహాన్ని ఉండి మండలంలోని కాలవలో పోలీసులు గుర్తించారు. అభిరామ్ విజయవాడ నారాయణ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పరీక్షల అనంతరం మంగళవారం స్నేహితులతో ట్రైన్‌లో భీమవరం వస్తుండగా అదృశ్యం అయ్యాడు. ఈ క్రమంలో అభిరామ్ మృతదేహం ఉండి కాలవలో పోలీసులు గుర్తించారు. విజయవాడలో తోటి విద్యార్థులతో గొడవ జరిగిందని, మృతదేహంపై గాయాలు ఉన్నాయని అభిరామ్ బంధువులు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - గణపవరం

మండలంలోని వల్లూరు శివారులో పేకాట శిబిరంపై ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు తన సిబ్బందితో శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.నాలుగు వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి : డివైఇఒ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



ఈ నెల మూడో తేదీ నుండి 18వ తేదీ వరకూ జరగనున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు డివైఇఒ రవీంద్ర భారతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పరీక్షలు ఉదయం 9:30 నుంచి 12:45 నిమిషాల వరకూ జరుగుతాయన్నారు. పరీక్షల సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని, అరగంట ముందుగా పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామని తెలిపారు. పదో తరగతి విద్యార్థులు తమ హాల్ టికెట్ చూపించి ఆర్‌టిసి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. మండలంలోని పెద్దతాడేపల్లి, కడియద్ద, కొమ్ముగూడెం, ఆరుగులను, మాధవరం, పెంటపాడు మండలంలోని అలంపురం మీనవల్లూరు పరీక్షా కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించామన్నారు. ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. గత సంవత్సరం 83 శాతం ఉత్తీర్ణత సాధించామని ఈ సంవత్సరం అంతకంటే ఎక్కువగా సాధించటానికి కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. తాడేపల్లిగూడెం మండలంలో 2976 మంది, పెంటపాడు మండలంలో 852 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు.

40 మంది ఇన్విజిలేటర్లను నియమించాం

ఎంఇఒ ఎ.రవీంద్ర

ప్రజాశక్తి - ఉండి



పదో తరగతి పరీక్షలకు సంబంధించి మండలంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంఇఒ ఎ.రవీంద్ర తెలిపారు. శుక్రవారం ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. మండలంలో పదో తరగతి పరీక్షలు 820 మంది విద్యార్థులు రాయనున్నారని తెలిపారు. 40 మంది ఉపాధ్యాయులను ఇన్విజిలేటర్లుగా నియమించామని తెలిపారు. మండలంలో ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఐదు పరీక్ష కేంద్రాల్లో ఐదుగురు చీఫ్ సూపరింటెండెంట్, ఐదుగురు డిపార్ట్మెంట్ అధికారులు ఉంటారన్నారు. ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 20 బెంచీలు తక్కువగా ఉండగా వేరే పాఠశాల నుంచి తీసుకొచ్చి బెంచీలు తాత్కాలికంగా ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగేనీటి కొరత లేకుండా శుద్ధి చేసిన జలాన్ని విద్యార్థులకు అందుబాటులో ఉంచామన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ సౌకర్యం, మెడికల్ క్యాంపు వంటివి అందుబాటులో ఉంచి పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి - పెనుమంట్ర

కార్పొరేట్ పాఠశాలకే పరిమితమైన ఫేర్‌వెల్ పార్టీలు వైసిపి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ పాఠశాలల్లో జరగడం సంతోషంగా ఉందని ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసురెడ్డి) అన్నారు. శుక్రవారం జుత్తిగ హైస్కూల్లో హెచ్‌ఎం ఆర్.మణి భారతి ఆధ్వర్యంలో ఫేర్‌వెల్ పార్టీకి ముఖ్యఅతిథిగా వాసు రెడ్డి హాజరయ్యారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కంటే భిన్నంగా విద్యా వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయన్నారు. విద్యార్థుల తల్లులకు ఏటా ప్రోత్సాహకంగా నగదు అందిస్తున్నట్లు తెలిపారు. ఎఎంసి ఛైర్మన్ వెలగల వెంకటరమణ (మిస్సమ్మ) మాట్లాడుతూ తాను ఈ హైస్కూల్లోనే చదువుకున్నానని తెలిపారు. ఎంఇఒ డి.శారదా జ్యోత్స్న మాట్లాడారు. ఈ హైస్కూల్లో సైన్స్ టీచర్ గా ఎనిమిదేళ్లు పనిచేసి ప్రమోషన్‌తో ఆలమూరు హైస్కూల్‌కు హెచ్‌ఎంగా బదిలీపై వెళ్లానని తెలిపారు. ముందుగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తమనంపూడి వీర్రెడ్డి, వైసిపి నాయకులు చిన్నారెడ్డి , సోమిరెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన ఎంపిపి కర్రి వెంకటనారాయణరెడ్డి (వాసురెడ్డి)

రైతులకు విస్తృత సేవలు

ప్రజాశక్తి - కాళ్ల

కోపల్లె సహకార బ్యాంకు ద్వారా రైతులకు విస్తృత సేవలందిస్తున్నామని ఆ బ్యాంకు త్రిసభ్య కమిటీ ఛైర్మన్ వేగేశ్న జయరామకృష్ణంరాజు అన్నారు. సొసైటీ కార్యాలయంలో మహాజన సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సొసైటీ ఆడిట్‌లో ప్రతి సంవత్సరం ఎ గ్రేడ్ పొంది లాభాల బాటలో పయనిస్తోంది. డిపాజిట్లపై తొమ్మిది శాతం వడ్డీ అందిస్తున్నారు. ఈ సందర్భంగా త్రిసభ్య కమిటీ ఛైర్మన్ వేగేశ్న జయరామకృష్ణంరాజు మాట్లాడుతూ సొసైటీ పరిధిలోని సుమారు 11 గ్రామాల్లో వరి, ఆక్వా రైతులకు సేవలందిస్తున్నామన్నారు. సమావేశంలో త్రిసభ్య కమిటీ సభ్యులు ముంజేటి రామకృష్ణ, గోళ్ల వెంకట రాంబాబు, సొసైటీ కార్యదర్శి జంపన సాయిగీత, అసిస్టెంట్ కార్యదర్శి మన్నె వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం

పజాశక్తి - తణుకు రూరల్

ముద్దాపురం ప్రాథమిక పాఠశాలలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ నూతన విగ్రహాన్ని పున:ప్రతిష్ఠించాక శుక్రవారం మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు పాలాభిషేకం చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం దువ్వలో శ్రీరామనవమి వేడుకలు సందర్భంగా ఆలయంలో జరిగిన అగ్నిప్రమాదంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు జరుగకుండా పందిళ్ల స్థానంలో శాశ్వత నిర్మాణాలు చేపట్టాలని ఎండోమెంట్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ముళ్లపూడి అన్నపూర్ణదేవి, గ్రామ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అదుపులోనే శాంతిభద్రతలు

ఐజి పాలరాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జిల్లాలో శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయని, రౌడీలు, సస్పెక్ట్‌లపై నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై, గంజాయి విక్రయించేవారిపై నిఘా ఉంచాలని ఐజి పాలరాజు జిల్లా పోలీస్ యంత్రాంగానికి సూచించారు. భీమవరం జిల్లా కేంద్రంగా ఏర్పాటైన తర్వాత మొదటిసారి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏలూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజి) జి.పాలరాజు వార్షిక తనిఖీ చేశారు. ఆయనకు ఎస్‌పి యు.రవిప్రకాష్ పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానించారు. గార్డ్ వందనం స్వీకరించారు. డిసిఆర్‌బి, ఎస్‌బి శాఖల కార్యాలయాలను సందర్శించి అక్కడ రికార్డ్స్ తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. ఆయనతో పాటు నరసాపురం డిఎస్‌పి మనోహర్‌చారి, సిఐలు, ఎస్‌ఐలు ఉన్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక సేవా శిబిరం

ప్రజాశక్తి - పాలకోడేరు

పల్లెలకు వచ్చిన విద్యార్థులకు గ్రామీణ ప్రజలు సమస్యలు, అభివృద్ధి అంశాలపై సూచనలు, సలహాలు ఇస్తే భవిష్యత్తులో ఆ పల్లె ప్రగతికి అవి ఎంతగానో దోహదపడతాయని భీమవరం ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వారం రోజులపాటు మోగల్లు గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక సేవా శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.కృష్ణచైతన్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు వారం రోజుల పాటు గ్రామీణ ప్రజలతో మమేకమై విద్యార్థులు చేసిన కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు. ఇదే సందర్భంలో గ్రామీణ ప్రజలు విద్యార్థుల దృష్టికి తీసుకొచ్చిన అంశాలు కూడా విద్యార్థులు మరువకుండా భవిష్యత్తులో వాటి సాధనకు తమ వంతు కృషి చేయాలన్నారు. గ్రామపంచాయతీ సర్పంచి ఎం.కృష్ణకుమారి, గ్రామ ప్రముఖులు, బాబు మాట్లాడుతూ విద్యార్థులు స్వచ్ఛభారత్ ఆరోగ్య సమస్యలపై చక్కని చైతన్యం తీసుకొచ్చే విధంగా కార్యక్రమాలు నిర్వహించారని ప్రశంసించారు. ఈ సందర్భంగా వారం రోజులపాటు శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణమరాజు, సర్పంచి కృష్ణకుమారి చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందించారు. క్యాంపు ముగింపు సందర్భంగా భీమవరం మ్యాక్స్ విజన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం, చర్మవ్యాధి నిపుణులతో చర్మవ్యాధి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో వచ్చి వైద్య సహాయం పొందారు.

విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - నరసాపురం

విద్యార్థులు పరీక్షల సమయంలో ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు ఎమ్‌డి.జాన్ చెప్పారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) పట్టణ కమిటీ బృందం శుక్రవారం నరసాపురంలో ఉన్న ఎల్‌బి.చర్ల, పేరుపాలెం, కెపి.పాలెం, తూర్పు తాళ్లు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. పదో తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులతో సంభాషించి విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు జాన్ మాట్లాడుతూ పరీక్షల సమయంలో ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులు పరీక్షల్లో ఎటువంటి ఒత్తిళ్లకు గురికాకుండా ఉండాలన్నారు. విద్యార్థులందరూ పరీక్షల్లో ప్రతిభను కనబరిచాలని ఆకాంక్షించారు.

రసబసాగా పాలకోడేరు సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - పాలకోడేరు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

రాజకీయపరంగా సాధారణంగా అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య పోటీ ఉంటుంది. సభలు, సమావేశాల్లో ఇరువురి మధ్య హోరాహోరీ నడుస్తూ ఉంటుంది. కాని మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో వింతపోకడికి నాంది పలికారు. ప్రతిపక్ష పార్టీ ఎలా ఉన్నా అధికార పార్టీలో ఉన్నవారే పరస్పర ఆరోపణలకు దిగారు. ఇరువురి మధ్య వాగ్వివాదం తారాస్థాయికి చేరింది. దీంతో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం రసాబసగ సాగింది. అభివృద్ధి పనుల్లో జాప్యం, ఉపాధి పనుల్లో అవినీతి, డ్వాక్రా సంఘాల్లో నగదు అవకతవకలపై ప్రజా ప్రతినిధులు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో గళమెత్తారు. అధికార పక్షానికి చెందిన సభ్యులే మండల పరిషత్ సమావేశంలో ప్రశ్నలు సంధించడంతో ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు సర్దిచెపాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాలకోడేరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటిరాజు) అధ్యక్షతన ఎంపిడిఒ ఎన్.మురళీగంగాధరరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత శాఖలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ క్రమంలో ఇటీవల జరిగిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజా వేదికలో సుమారు రూ.7 లక్షలు దుర్వినియోగం జరిగినట్లు వెల్లడి కావడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. శృంగవృక్షం గ్రామానికి చెందిన మరొక ఎంపిటిసి సభ్యురాలు బళ్ల భారతి తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతానికి నిధులు మంజూరు చేసినా పనులు జరగకుండా స్థానిక సర్పంచి జంగం సూరిబాబు, ఉప ఎంపిపి నరేష్ అడ్డుపడుతున్నారని ఆరోపించారు. దీంతో ఇరువురి మధ్య కొంతసేపు వాగ్వివాదం చోటుచేసుకోవడంతో ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు వారికి సర్దిచెప్పారు. ఈ సమావేశంలో ఉప ఎంపిపి లక్ష్మీతులసి, ఎంపిటిసి సభ్యులు పాలా జ్యోతి, కె.నాగలక్ష్మి, తహశీల్దార్ షేక్ హుస్సేన్, పంచాయతీ విస్తరణ అధికారి వి.రెడ్డియ్య, పంచాయతీరాజ్ ఎఇ విజయకుమార్‌రాజు, ఎఒ వి.నారాయణరావు, ఆర్‌అండ్‌బి ఎఇ శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు.

రెడ్డినాయుడుకు ఉగాది విశిష్ట సేవా పురస్కారం

భీమవరం రూరల్ :భీమవరం సహకార బ్యాంక్ మేనేజర్ రెడ్డినాయుడుకు విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఉగాది విశిష్ట సేవా పురస్కారా న్ని శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా రెడ్డినాయుడు మాట్లా డుతూ ఉద్యోగులు వృత్తి ధర్మాన్ని పాటిస్తే అవార్డులు అవే వస్తాయన్నారు. మూడున్నర దశాబ్దాలుగా అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు ఉగాది అవార్డులు అందించడం గొప్ప విశేషమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ గ్రామీణ వ్యవస్థలో సహకార బ్యాంకులు, రైతులకే కాకుండా అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాల ద్వారా ఎన్నో సేవలు అందిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో రెడ్డినాయుడుకు ఉగాది పురస్కారాన్ని అందించి సత్కరించామని తెలిపారు.

సైన్స్ పితామహుడు న్యూటన్

భీమవరం రూరల్ :సర్ ఐజాక్ న్యూటన్ వర్ధంతి కార్యక్రమాన్ని శ్రీభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు న్యూటన్ జీవిత చరిత్రపై పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి శుక్రవారం బహుమతులను అందించారు. స్కూల్ ప్రిన్సిపల్ హరికృష్ణ, కెజిఆర్ఎల్ ఫార్మసీ డైరెక్టర్ కె.నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ శాస్త్రవేత్తల్లో గొప్ప శాస్త్రవేత్త న్యూటన్ అని, భూమికి కూడా అయస్కాంత శక్తి ఉందని, మానవ ప్రపంచానికి విశ్వ రహస్యాలను విడమర్చి చెప్పిన సర్ ఐజాక్ న్యూటన్ ఒక ఆంగ్ల భౌతిక, గణిత, ఖగోళ శాస్త్రవేత్త అని అన్నారు. జిటిపి మహిళా కళాశాల బిఇడి, డిఇడి ప్రిన్సిపల్స్ ఎ.ధనలక్ష్మి, ఎ.జొహన్నా, ఫార్మసీ ప్రిన్సిపల్ రాఘవ మాట్లాడుతూ ప్రకృతి సిద్ధమైన తత్వశాస్త్రం సైన్సుగా ఎలా పరిణామం చెందిందన్న అంశంపై చేసిన ఎనలేని కృషికి ఆధునిక ప్రపంచమంతా ఆయనను సైన్సు పితామహుడుగా కీర్తించిందన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 40 మంది విద్యార్థులకు సైన్స్ పితామహుడు ఐజాక్ న్యూటన్ జీవిత చరిత్రపై పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను కాలరాస్తున్న బిజెపి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

కార్మిక వర్గం అనేక పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు చింతకాయల బాబురావు, కె.నాగేశ్వరరావు అన్నారు. తాడేపల్లిగూడెం తాలూకా రైల్వే గూడ్స్ వర్కర్స్ యూనియన్ 39వ వార్షికోత్సవం సత్తి కోదండరావి ంరెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. యూనియన్ జెండాను కె.వెంకట్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సంవత్సర కాలంలో జరిగిన కార్యకలాపాల రిపోర్టు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి ప్రవేశపెట్టగా సభ్యులు చర్చించి ఆమోదించారు. ఈ సందర్భంగా బాబురావు, నాగేశ్వరరావు మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షులుగా సత్తి కోదండరాంరెడ్డి, ఉపాధ్యక్షులుగా సాయిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పుల్లారెడ్డి, సహాయ కార్యదర్శిగా నాగేశ్వరరావు, కోశాధికారిగా ఎస్‌విఎస్.రెడ్డి, కమిటీ సభ్యులుగా ఆకుల నారాయణ, సుబ్బిరెడ్డి, అడపా ఆంజనేయులు, మద్దాల పుత్రయ్య, అడ్డగర్ల కృష్ణ, బుద్దాల నాని, ఎంద్రప్ కృష్ణ, వెంకట్రావు ఎన్నికయ్యారు.

మహిళా పక్షపాతి జగన్ : పివిఎల్

ఉండి :మహిళా పక్షపాతి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని డిసిసిబి ఛైర్మన్ నరసింహరాజు అన్నారు. శుక్రవారం ఉండి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన వైఎస్‌ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పివిఎల్ నరసింహరాజు, గోకరాజు రామరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 1257 గ్రూపులకు సంబంధించి 12,586 మంది మహిళలకు 15,30,50,094 రూపాయల నగదు చెక్కు పంపిణీ చేశారు. అనంతరం డ్వాక్రా మహిళలు జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారా యణ రాజు, జెడ్‌పిటిసి రణస్థుల కనకదుర్గ మహ ంకాళి, రాష్ట్ర జానపద సృజనాత్మక అకాడమీ కార్పొ రేషన్ డైరెక్టర్ అచ్చారావు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి

ప్రజాశక్తి - గణపవరం

ప్రతి శుక్రవారం స్థానికులు డ్రై డే పాటించాలని కాశిపాడు ఆరోగ్య సహాయకులు నామాల రాజు అన్నారు. శుక్రవారం సిహెచ్‌సి అగ్రహారంలో జరిగిన డ్రై డేలో ఆయన పాల్గొని స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు బి.దుర్గాభవాని, పి.దుర్గ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.